

# అవసరం

— బస్సారెడ్డి

బయట చక్కటి వెన్నెల. చలి ఇంకా పూర్తిగా ముదరని చిన్న చలిగాలి. వాతావరణం చాలా ఆహ్లాదంగా ఉంది. నాకు అప్పుడే ఇంటికి వెళ్ళాలని లేదు. కారణం వాతావరణం బావుండటమే! ఇంత మంచి రోజు వంటరిగా ఇంట్లో గడపడం ఇష్టం లేదు. మా ఆవిడ, పిల్లలు వూరు వెళ్ళారు. వెళ్ళింది ఈ రోజే గనుక ఇప్పట్లో రారు కూడా.

బాల్కనీలో పారపెట్ మీదికి కాళ్ళు చాపాను. వీపు వెనక చక్కటి దిండు వేశాడు కుర్రాడు. ఇంత కులాసాగా కూర్చున్నానే గాని సరయిన టాపిక్ రావడం లేదు చుట్టుపట్ల వున్న వారిలో.

అందినంత మటుకు తాగేందుకే వచ్చినట్లున్నారు జనమంతా.

"ప్రపంచంలో భర్త పోయిన ఆడవాళ్ళు మనదేశంలోనే ఎక్కువనుకుంటాను" అన్నాను పక్కనున్న ఆయనతో.

"అదేమిటీ! గబుక్కున ఆ

విషయంలోకి వెళ్ళావు?" అడిగాడు జనార్ధనరావు.

"పొద్దున్నెక్కడో పేపరులో చూశాను ఒక పెద్ద హెడ్డింగ్. అయితే చదివేందుకు కుదరలేదు."

"విధవ వాళ్ళంటే అంత జాలెందుకో?" మళ్ళీ అతనే అన్నాడు.

"అందరంటే అయ్యుండదు గురువుగారికి. బ్యూటిఫుల్ యంగ్ విడోస్ అంటేనే అయ్యుండాలి."

మాట్లాడింది ఎవరా అని చూశాను. కొత్తగా చేరా డీయన-'రావ్' అంటారంతా. కొన్నాళ్ళు మిలిటరీలోనో, ఎందులోనో పని చేశాడని చెప్పా రెవరో.

"ఆ దృష్టితో మాట్లాడలేదు. కేవలం అవుటాఫ్ పిటీ-జాలితోనే! మన కళ్ళ ముందు మొగుడుపోయిన ముప్పయ్యేళ్ళమ్మాయి అలానే ఉండి పోతుంది. భార్యపోయిన నలభయి ఏళ్ళ వాడిని నిముషం ఖాళీగా ఉండనీరు మనవాళ్ళు. సంబంధం మీద సంబంధం తెచ్చి వాడిని మళ్ళీ నిముషాల మీద సంసారంలోకి తోసేస్తారు. అనకూడదు గాని, కొందరు మగాళ్ళు రిలీఫ్ ఫీలవుతారేమో కూడా-వెరైటీ దొరకలా మరి?"

"మరీ భయంకరంగా మాట్లాడుతున్నారు." నవ్వాడు శర్మగారు.

"నిజం ఎప్పుడూ ముక్కు మీద గుద్దినట్లుంటుంది లెండి!" అని ఒక్కసారి చిన్నగా దగ్గాడు రావుగారు. ఆయనకి చెప్పబోయే 'విషయం' ఏదో ఉండి ఉండాలని అటు చూశాను.

"జాలి ఆడదాని మీద ఉండేవారు లేకపోలేదు సార్! అయితే ఊరికే జాలిపడి చేయగలిగింది ఏముందిట? మళ్ళీ ఆమెను పెళ్ళాడేందుకు సిద్ధపడాలిగా ఎవరయినా?" అన్నాడు.

"కరెక్ట్-కరెక్ట్! అయితే డబ్బు కొంచెం ఎక్కువగా ఇస్తే ఆశ పడేవారు ఉండొచ్చుననుకుంటా!" అన్నాను.

"ఉండరండి! అసలు పెళ్ళి కాని అమ్మాయిలు డబ్బుతో సహా కాళ్ళ ముందుకు వస్తూంటే, చేసుకునే వాడికేం ఖర్మ-సంసారం చేసిన ఆడదాన్ని చేసుకునేందుకు?"

"ఐ డోంట్ బిలీవ్! ఉంటారు."

"పూర్తిగా ఉండరు అనడం లేదు గురూగారూ! కాని ఆ డబ్బు కోసం ఆశ పడొచ్చుగా!"

"ఆఁ-పెద్ద పెద్ద సిటీస్‌లో ఇవ సలు సమస్యే కాదు!" శర్మ అన్నాడు.

"లేదు! అక్కడా సమస్యే. మా ఫ్రెండు వాళ్ళ అంకుల్-

మామయ్య-ఒకాయన శాయశక్తులా ప్రయత్నించాడు. చిన్న ఇన్సిడెంటు చెబుతాను- బోరు కాదంటే."

"నా పెటాల్ - చెప్పండి!" అన్నాను.

నాక్కావలసిందదేగా! ఒక గంట కాలక్షేపం తరువాత వెళ్ళి నిద్రపోవచ్చు.

"మా స్నేహితుడు ఒకడు.... మా స్నేహితుడున్నాడు లెండి. వాడికి ఒక మేనమామ ఉన్నాడు. ఆయన చాలా పెద్ద ఆఫీసర్. వెరీ బిగ్ షాట్! ఒకే ఒక్క కూతురు. కుందనపు బొమ్మ. సినిమా హీరోయిన్‌లా ఉంటుంది. చాలా అందమయినది. నాజూకయినది. చాలా గారాబంగా పెరిగింది. ఒక్కతే కూతురని చెప్పాగా! చెప్పానా లేదా?"

"చెప్పారు - చెప్పారు" అన్నాను.

"టూకీగా చెప్పేస్తాను. మా ఫ్రెండు అతి సాధారణమయిన మనిషి-అంటే లేనివాడు. చదువుకునేందుక్కూడా ఆ మేనమామ సాయం చేస్తేనే- ఆ కాస్తయినా చదివాడు."

"మీ వాడికా పిల్ల ఈడు కాదా?"

"ఈడు కాకేం? నిక్షేపంగా! పైగా చక్కగా సరిపోతారు కూడా- 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' జోడు లాగా. ప్చ్! వాడికా యోగం లేదు. ఆయన దృష్టికి వాడు అసలు ఆనడు."

"పోనీ, శశిరేఖ దృష్టికి ఆనలేదా మీ వాడు?" అన్నాను నవ్వుతూ.

"ఆ అమ్మాయి పేరు అది కాదండి-సరోజ."

"అబ్బెబ్బె! ఊరికేఅభిమన్యుడు, శశిరేఖ గుర్తుకొచ్చి...." అని నవ్వేశాను.

"వాళ్ళెవరు?" అడిగాడు.

"ఎవరూ లేరు గాని, మీరు చెప్పండి!"

"మా వాడూ ఆశపడ్డాడు. అయితే ఆ పిల్ల అందేది కాదని గుండె రాయి చేసుకున్నాడు. తరువా త్తరువాత ఆయన కూడా ఒకనాడు పిలిచి చెప్పాడు హఠాత్తుగా- 'ఇంక చదివించలేనని, ఎక్కడయినా ఉద్యోగం చూసుకోమనీ'ను."

"సరే, తరువాత మా వాడెక్కడో ఉద్యోగం సంపాయించుకున్నాడు. పెళ్ళి అయింది. ఇద్దరు పిల్లల్ని కూడా కన్నాడు. ఈ కాలంలోనే ఆ అమ్మాయికి గొప్ప ఉద్యోగం చేసే ఒకడిని వెతికి పట్టుకుని పెళ్ళి చేశాడు ఆయన. ముస్సోరీకో, నైనిటాల్‌కో హనీ

మూన్‌కి పంపాడు. అదయిన మరో ఏడాదికి ఆ అమ్మాయి ఇంటికి తిరిగొచ్చేసింది- పర్మనెంటుగా!"

"అంటే?"

నవ్వాడు. "అంటే ఏముంది గురూగారూ! ఇందాక మీరేగా భర్త పోయిన వాళ్ళ జనాభా గురించి అన్నారు-అదే హోదాల్లో. ఆ భర్త గారు చచ్చిపోయాడు. అసలు వాడు అర్భకుడుట లెండి!"

"అరె-పాపం!"

"పాపమే! ముసిలాడికి గుండె ఆగిపోయింది! ఆయన రెండు కళ్ళూ ఆ అమ్మాయే! ఏదో కులాసాగా కాపురం చేస్తూ మొగుడి ఉద్యోగం, తన ఆస్తీ అనుభవిస్తూ ఏడాది కొకడ్ని కంటూ ఉంటుందని ఆశ పెట్టుకున్నాడు గదా! అదంతా నిరాశయిపోయింది. ఒక్క ఏడాది మాత్రం కాపురం చేసిందన్న మాట!

"సరే-మా వాడి సంగతి. కలిసి పెరిగిన వాళ్ళు, ఆ అమ్మాయంటే చచ్చేమనసున్నవాడు, అంతకన్నా ఎక్కువగా మేనమామకి ఒకే ఒక్క కూతురు అయినందువలన-ఆయనను, ఆ అమ్మాయిని పలకరించవలసిన బాధ్యత ఉందని వాడు గ్రహించాడు. అయితే అన్నీ తెముల్చుకుని వెళ్ళేసరికి మరో ఏడాది గడిచింది.మావాడు వెళ్ళాడు.

"వాడిని చూడగానే అంతటి పులి లాంటి మేనమామ కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు. బహుశ ఆయనకి కూతురు పెళ్ళి వీడితో చేస్తే బావుండిపోయే దనిపించి ఉండొచ్చు. గొప్పవాడు కాక పోయినా మొగుడంటూ ఒకడుండే వాడు కదా!"

"కష్టంలో మీ వాడు వెళ్ళి ఆయన్ని పలకరించడంతో ఆయన లోని ఆత్మీయత పైకి వచ్చి ఉండొచ్చు కదా?" అన్నాను.

రావుకి అది నచ్చలేదు. "అదేం కాదు. నేను అన్నదే కరెక్టు! ఆ మర్నాడు ఆయనే అన్నాడు లెండి-'నీకిచ్చి చేస్తే పోయేదిరా అబ్బాయ్! ఇప్పుడీ ఖర్మ రాసి ఉంటే అలా ఎందుకు బుద్ధి పుడుతుంది?' అని."

నేనవ్వాను. రావు మళ్ళీ మొదలెట్టాడు- "'పోనీ సరోజకి మళ్ళీ పెళ్ళి ప్రయత్నించకపోయావా మామయ్యా!" అని అడిగాడు మా వాడు.

"ఎందుకు చేయనురా అబ్బాయ్! నా శాయశక్తులా ప్రయత్నించాను. తలా తోకా ఉన్నవా డెవడూ ముందుకు రావడం లేదు. అడ్రసు లేని వాళ్ళు, బేవార్స్‌గాళ్ళు వస్తున్నారు. వాళ్ళకి నా ఆస్తి మీద

ప్రేమ ఎక్కువని నా నమ్మకం" అన్నాడాయన.

మాటల్లో మా వాడి వివరాలు అన్నీ అడిగి తెలుసుకున్నాడు ఆయన. "ఇద్దరు పిల్లలు. ఇక పిల్లలు చాలునని ఆపరేషన్ చేయించుకున్నాను మావయ్యా" అని చెప్పాడు కూడా వాడు.

ఆ మరుసటి రోజు ఆయన వాడిని దగ్గర కూర్చో పెట్టుకుని మరీ కూర్చున్నాడు. "సరోజా! నాకూ, బావకీ కాఫీ ఇక్కడికే పంపించమ్మా" అని చెప్పాడు.

మా వాడికి కొంచెం ఆశ్చర్యం వేసింది. సాధారణంగా ఆయన నోటితో ఆయన వీడిని 'బావ' అని అనడం ఎన్నడూ జరగలేదు.

టిఫిన్ పెట్టి వెళ్ళిపోతున్న సరోజ వైపు చూస్తూ, "చూడరా శేషూ! దీని జీవితం ఎలా అయిపోయిందో? ఈ పాటికి ఎలా ఉండవలసిందంటావు ఈ వయసులో?" అని కాసేపాగి, "దాని వయసు తెలుసా?" అనడిగాడు.

"అదేమిటి మావయ్యా! నాకు తెలియక పోవడమేమిటి- ఇరవై అయిదు" అని అనేసి అంతలోనే సిగ్గుపడ్డాడు మా వాడు.

"కరెక్ట్ - ఇరవై ఐదు. నిండు యవ్వనం అంటారే అదన్న మాట! ఈ ఏజ్‌లో మీ అత్తయ్య నన్ను క్షణం వదిలిపెట్టేది కాదు- ఐ మీన్ మేమిద్దరం క్షణం వదిలి ఉండే వాళ్ళం కాము."

మా వాడేం మాట్లాడలేదు. అంతలో సరోజ మళ్ళీ కాఫీతో వచ్చింది. తల వంచుకుని కాఫీలు బల్ల మీద పెట్టి, టిఫిన్ పళ్ళాలు తీసుకుని వెళ్ళిపోయింది.

'మనిషి కొంచెం చిక్కినా నిండు చంద్రుడిలా ఉంది' అనుకున్నాడు మా వాడు.

"స్నేహంగా, మనసు విప్పి మాట్లాడేందుకు దానికి దాని ఈడు వాళ్ళు లేరురా అబ్బాయ్- ఇంట్లో! నన్ను చూస్తే గౌరవం, భయం దానికి. అదృష్టవశాత్తు నువ్వు వచ్చావు. ఒక నాలుగు రోజులుండి సరదాగా మాట్లాడించు నాయనా దాన్ని. అది నవ్వుతూ, తిరుగుతూంటే చూడాలని నా కోరిక" అన్నాడు ఆయన చివరగా.

మా వాడికి ఆయన మాటలన్నీ వింతగా తోచాయి. ఏం మాట్లాడ లేదు వాడు. బయటికి వెళ్ళిపోయాడు. సిగరెట్ ప్యాకెట్, అగ్గిపెట్టె కొనుక్కున్నాడు. వాడి బుర్రలో ఆయన మాటలు మెదులుతూనే వున్నాయి. వాటివెంట ఆలోచనలు వస్తూనే ఉన్నాయి.

మధ్యాహ్నం భోజనాలు కావడం తోనే నిద్రపోవడం వాళ్ళ మావయ్యకి అలవాటు.

ఆ టైములో నేరుగా సరోజ గదిలోకి వెళ్ళాడు మావాడు. పడుకుని కిటికీలోంచి బైటికి చూస్తున్న దల్లా గభాలున లేచి నిలబడింది సరోజ వాణ్ని చూడగానే.

"ఏమిటి సరూ! నన్ను చూసి అంత ఖంగారు పడతావు? ఇంకా నేనంటే అసహ్యమేనా?" అన్నాడు.

మాట్లాడకుండా వెక్కెక్కి ఏడవడం మొదలెట్టింది.

"నువ్విలా దిగులుగా ఉంటే మీ నాన్న ఎంతగా బాధపడుతున్నాడో తెలుసా? జీవితంలో మంచి- చెడులకు సంబంధించిచాలా సంఘటనలు జరుగుతూ వుంటాయి. రెంటినీ తేలికగా తీసుకో గలగాలి సరోజా! నేను జీవితంలో నేర్చుకున్న పాఠం ఇదే. ఈ క్షణాన్నే బ్రతుకు అనుభవించు. రేపు గురించి బెంగెట్టుకోకు. నిన్న గురించి ఆలోచించకు. ప్రతి మనిషి జీవితంలోనూ 'నిన్నలు' కొన్ని అసహ్యామైనవి ఉండి తీరతాయి. వాటి గురించే దిగులు పడుతూంటే ఆశాజనకంగా ఉండబోయే భవిష్యత్తు కూడా తగలడిపోవచ్చు" అనీ నవ్వుతూ, "వేదాంతం చాలు గాని మీ ఆయన ఫోటో ఉందా? నేనసలు ఆయన్ని చూడనేలేదు సుమా! కనీసం ఇలాగైనా చూద్దాం" అన్నాడు.

డ్రస్సింగ్ టేబుల్ దగ్గరకు వెళ్ళింది సరోజ. సొరుగు లాగి ఫోటో బయటికి తీసింది. ఆమె వెనకే నిలబడి ఉన్నాడు మావాడు. అద్దంలోకి ఇద్దరూ ఒకేసారి చూసారు.

మా వాడు బావుంటాడు. కనీసం అప్పుడు బావుండేవాడు. ఆజానుబాహువు. అతనికి భుజాల దగ్గరకి వచ్చింది సరోజ. ఫోటోని ఫ్రేము చేసినట్లుగా అద్దంలో ఇద్దరి బింబాలు కనబడ్డాయి.

నవ్వి, ఆమె చేతిలోని ఫోటో అందుకున్నాడు. "కరెక్ట్! నీకు ఇతను మాచ్ కాడు సరోజా! నేననుకుంటూనే ఉన్నాను. ఎంతుండే వాడేం? ఫైవ్ ఫైవ్ ఉంటాడేమో! నీకన్న ఒక్క అంగుళం మాత్రం పొడుగు."

మళ్ళీ అప్రయత్నంగా అద్దంలోకి చూసిందామె. ఆమె తలవాటి మావాడు ఆరేడు అంగుళాలుంటాడు.

"గుర్తుందా సరూ! చిన్నతనంలో నిన్నొకసారి ఇలా దగ్గరకి తీసుకున్నాను. గట్టిగా ఇలాగే నా చేతుల మధ్య నిన్ను బంధించేశాను. అంత బలమైన వాడినీ నన్ను

ఒక్క విదిలింపు విదిలించేసి, లాగి కొట్టావు."

సరోజ కప్పుడు తెలిసివచ్చి నట్లుంది-తను మా వాడి చేతుల్లో ఉన్నానని. వదిలించుకోబోయింది.

"వదులు బావా! ఏమిటిది?" అంటూనే ఉంది సరోజ.

"ఏం ఫర్లేదు సరోజా! పబ్లిగ్గా వచ్చాను నీ గదిలోకి తెలుసా? కావాలంటే ఇలాగే నిన్ను తీసు కొని మీ నాన్న ముందుకూ వెళ్ళ గలను. వస్తావా?"

"ఛ- అదేమిటి?"

"పిచ్చిదానా! అసలు నిన్ను చేసుకోవాలసిన హక్కు నాది. నువ్వు నా దానివి. మీ నాన్న మాత్రం ఇప్పుడు బాధ పడడం లేదంటావా? నా వలన నీ కెటు వంటి ప్రమాదం రాదు. నా కిద్దరు పిల్లలు. 'పిల్లకీ పిల్లకీ మధ్య ఎడం, ఆ తరువాత అసలే వద్దు' అన్నది తు.చ. తప్పకుండా పాటించిన వాడిని. అర్థమయిందను కుంటాను?"

ఆమె పెనుగులాడుతూనే ఉంది. అయితే మా వాడు పట్టించుకో లేదు. పట్టించుకోవలసినంత అభ్యం తరం ఆమె నుంచి రాలేదు.

రెండు రోజులుండి పోదామను కున్న వాడల్లా అక్షరాల పదిహేను రోజులున్నాడు మావాడు. వాళ్ళింట్లో అల్లుడికి జరిగాయో లేదో ఆ మర్యాదలు! అత నంత సుఖపడ్డాడో లేదో!

బయలుదేరే రోజున వాళ్ళ మామయ్య పిలిచాడు వాడిని. ఆయన వాడి ముఖం వైపు చూడ లేదు. వాడు ఆయన వంక చూడ లేదు.

"శలవులు వచ్చినప్పుడల్లా వస్తూండరా! ఇదిగో- ఇది తీసుకుని పిల్లల కేమయినా కొనిపెట్టు" అంటూ కవరొకటిచ్చాడు ఆయన.

"వద్దు మామయ్యా!" అంటూనే తీసుకున్నాడు. రైలెక్కాక చూసు కుంటే అందులో వెయ్యి రూపాయ లున్నాయి...."

"మై గాడ్! అదెక్కడి ఫాద రండీ ఆయన?" అన్నాడు శర్మ.

నాకూ ఏదో చిరాగ్గా ఉంది ఈ కథంతా. 'నిజమే- జీవితంలో శారీరక సుఖంకి కూడా అవసరం ఉంది. అంత మాత్రాన అది తనే ఏర్పాటు చేసే ఫాదర్‌ని విశాల హృదయుడనాలా?'

రావు ఏమీ మాట్లాడలేదు. విన్న వాళ్ళు మాట్లాడకుండా లేచి వెళ్ళిపోయారు. నేనూ, రావు మిగిలాం.

"చేసిన పాపం చెబితే

పోతుందంటారు. మీకొంత పాపం పోయిందనుకోండి రావు గారూ!" అని నవ్వి, "పోనీ పుణ్యం వచ్చిందనుకోండి- ఒక మనిషిని ఆదుకున్నారు" అన్నాను.

"లేదండి- పాపమే! చివరి దాకా చెప్పలేదింకా. నేను చెప్పక పోతే పాపం పెరుగుతుంది కూడా. ఆ అమ్మాయి- సరోజ చచ్చి పోయింది తరువాత!"

"ఎందువలన?"

"నెల తప్పింది."

"అదేమిటి? మీ వాడు ఆప రేషన్ చేయించుకున్నాడుగా?"

"అదంతా అబద్ధం. అబద్ధ మాడాడు. నోటికి ఆ సమయానికి ఆ మాట వచ్చింది- అనేశాడు. వాడికా అమ్మాయంటే చచ్చే ఇష్టం. అందు కబద్ధం ఆడాడు. కాని ఇంతగా కొంప మునుగుతుం దనుకోలేదు. నెల తప్పినా ఆ అమ్మాయి కూడా నమ్మలేదు. బాగా ఆలస్య మయ్యేదాకా అస లనుమానించనే లేదనుకుంటాను. తరువాత నిద్రమాత్రలు వేసుకుని చచ్చిపోయింది."

"మై గాడ్!" అన్నాను.

"మామయ్యా .... మా వాడి మామయ్యా ఉత్తరం రాశాడు తరువాత- 'ఇంత అన్యాయం చేస్తా వనుకోలేదురా— నీ మాట నమ్మాను' అని."

నేనేమీ మాట్లాడలేదు.

"తరువాత కొన్నాళ్ళకి ఆయనా పోయాడు దిగులుతో. అవునూ- ఇందాక మీరు 'చేసిన పాపం చెబితే పోతుం'దన్నారు. అలా అనటంలో మీ ఉద్దేశం?"

"ఏముంది? ఇందులోని మామయ్య ఉన్నాడు గాని, 'మీ వాడు' లేడు. మీరే మీవాడి పాత్ర."

"అలాగెందు కనుకుంటు న్నారు?"

"ఇంత వివరం అసలు వ్యక్తికి తప్పితే మరొకరికి తెలియదు. లేదా- కేవలం కల్పితం కథయినా అయ్యుండాలి"

"అలా అనుకోకండి. బాగా ఉందా కథ?"

"కథలు చెప్పడం రాదని ముందే అన్నారు మీరు?" నవ్వుతూ అన్నాను.

ఆయనేం మాట్లాడ లేదు.

టైము చూసుకున్నాను. ఇక నాకు నిద్రకి వేళయింది. అందుకని లేచాను.

అతనలా చీకట్లోకి చూస్తూ కూర్చునే ఉన్నాడు. *